సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

శనివారం । 2 । సెప్టెంబర్ । 2023



ఘనంగా సామూహిక వ్రతాలు

పాడేరు ఉమానీలకంఠేశ్వరస్వామి ఆలయంలో సామూహిక వరలక్ష్మి వ్రతాలను భక్తిశ్రద్ధలతో మహిళలు నిర్వహించారు.



కార్యకర్తలకు పార్టీ అండ IIలో

కష్టపడి పనిచేసే కార్యకర్తలు, నాయకుల పార్టీ అండగా ఉంటుందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు భాగ్యలక్ష్మి పేర్కొన్నారు.



విద్యార్థినులు క్షేమం

అదృశ్యమైన చింతపల్లి గిరిజన సంక్షేమ శాఖ బాలికల ఆశ్రమ పాఠశాల విద్యార్థినులు క్షేమంగానే ఉన్నారని పోలీసులు తెలిపారు. IIలో

న్యూస్‌రీల్

పాఠశాలలో న్యూట్రీ గార్డెన్ ఏర్పాటు



న్యూట్రీ గార్డెన్‌లో విద్యార్థులు

కొయ్యూరు: గ్రామ స్వరాజ్య సమితి ఆధ్వర్యంలో శరభన్నపాలెం బాలుర ఆశ్రమ పాఠశాలలో న్యూట్రీ గార్డెన్‌ను ఏర్పాటు చేశారు. సేంద్రియ ఎరువుల ద్వారా అవసరమైన ఆకు కూరలు, కూరగాయలను పండిస్తున్నారు.వీటిని విద్యార్థులకు అందించే ఆహారం తయారీకి వినియోగిస్తున్నారు. పీడీ కొండబాబు, వార్డెన్ రమేష్, హెచ్‌ఎం అప్పలనాయుడు సహకారంతో న్యూట్రీ గార్డెన్‌ను ఏర్పాటుచేసినట్టు ప్రకృతి వ్యవసాయ నిపుణుడు గణేశ్ తెలిపారు. ద్రవ జీవామృతం, కసాయం వినియోగించడం వల్ల ఆరోగ్యకరమైన దిగుబడి వస్తోందన్నారు.

విద్యా రంగానికి అధిక ప్రాధాన్యం



ప్యానెల్ బోర్డును ప్రారంభిస్తున్న విద్యాకమిటీ చైర్మన్ జిక్రియా

చింతూరు: రాష్ట్రంలో విద్యారంగానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ ఎండీ జిక్రియా అన్నారు. పాఠశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన ప్యానెల్ బోర్డులను ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం నాడు–నేడు ద్వారా పాఠశాలల రూపురేఖలు మార్చివేసిందని, పేద విద్యార్థులకు సైతం కార్పొరేట్ స్థాయి విద్య అందుతోందన్నారు. గ్రామీణ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలనే లక్ష్యంతో తరగతి గదుల్లో ఇంటరాక్టివ్ ప్యానెల్ బోర్డులను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ అనంతలక్ష్మి, ప్రధానోపాధ్యాయులు బాలకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరా నిలిపివేత రేపు

ముంచంగిపుట్టు: విద్యుత్ ఉపకేంద్రాల నిర్వహణ పనుల నిమిత్తం ముంచంగిపుట్టు,పెదబయలు మండలాల్లో ఈ నెల 3వ తేదీన విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు విద్యుత్‌శాఖ ఈఈ ఎ.వి.ఎస్.అప్పారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈనెల 3వ తేదీ ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 4గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఆయన పేర్కొన్నారు. రెండు మండలాల విద్యుత్ వినియోగదారులు సమస్యను గుర్తించి సహకరించాలని ఆయన కోరారు.

విస్తారంగా వర్షాలు



దుంబ్రిగుడలో ఇళ్లలోకి చేరిన వర్షం నీరు

దుంబ్రిగుడ: మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో శుక్రవారం సాయంత్రం నుంచి భారీ వర్షం కురుస్తోంది. దీంతో రోడ్లు జలమయం అయ్యాయి. గ్రామంలో డ్రైనేజీలు లేకపోవడం వల్ల ఇళ్లలోకి వర్షం నీరు చేరడంతో గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారు.
అరకులోయ రూరల్: అరకులోయలో శుక్రవారం భారీ వర్షం కురిసింది.

సీతాఫలాలకు మంచి ధర



పాడేరులో సీతాఫలం అమ్మకాలు

సాక్షి,పాడేరు: స్థానిక పాతబస్టాండ్ మార్కెట్‌లో శుక్రవారం భారీగా సీతాఫలాల అమ్మకాలు జరిగాయి.పాడేరు,జి.మాడుగుల ప్రాంతాలకు చెందిన గిరిజనులు పండ్లను బుట్టలతో తీసుకువచ్చి అమ్మకాలు చేపట్టారు.మైదాన ప్రాంతానికి చెందిన వ్యాపారులు బుట్టు రూ.600 నుంచి రూ.700కు కొనుగోలు చేశారు. మంచి ధర రావడంతో గిరి రైతుల్లో ఆనందం వ్యక్తమైంది.

గిరిజనుల ఆర్థికాభివృద్ధిలో దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రవేశపెట్టిన ఎన్నో పథకాలు కీలకపాత్ర పోషించాయి. సాగు చేస్తున్న అటవీ భూములకు అటవీహక్కు చట్టం ద్వారా పట్టాలు పొందారు. ఇలాంటి పథకాలెన్నో ప్రవేశపెట్టిన ఆయన గిరిజనుల గుండెల్లో చిరస్థాయిగా స్థానం సంపాదించుకున్నారు. శనివారం ఆయన వర్థంతి సందర్భంగా ప్రత్యేక కథనం

- పాలనలో గిరిజనుల కోసం ప్రత్యేక కార్యక్రమాలు
- అటవీహక్కు చట్టంతో ఎంతో మందికి భూహక్కు
- అందుబాటులోకి కార్పొరేట్ వైద్యం
- మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి
- మన్యం అభివృద్ధికి బాటలు వేసిన వైఎస్
- నేడు ఆయన వర్థంతి

గిరి గుండెల్లో రాజన్న



సాక్షి, పాడేరు: సంక్షేమం అంటే తెలియని రోజులవి.. అటువంటి పరిస్థితుల్లో ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వైఎస్ రాజశేఖరరెడ్డి పాలనలో తనదైన ముద్రవేసుకున్నారు. ఎన్నో సంస్కరణలు చేపట్టారు. ప్రధానంగా గిరిజనుల కోసం ప్రత్యేకంగా సంక్షేమ కార్యక్రమాలు అమలుచేశారు. కార్పొరేట్ స్థాయిలో ఉచిత వైద్యం, అటవీహక్కు చట్టం ద్వారా భూహక్కు ఇలా.. ఎన్నో పథకాలను ఆయన ప్రవేశపెట్టి గిరిజనుల ప్రగతికి బాటలు వేశారు.

సమర్థవంతంగా..

- అటవీహక్కుల చట్టాన్ని వైఎస్ సమర్థవంతంగా అమలు చేశారు. అంతకు ముందు అడవిలో పోడు, ఇతర వ్యవసాయ పనులు చేసే గిరిజనులపై అటవీశాఖ కేసులు నమోదు చేసి జైలుకు పంపించే పరిస్థితి ఉండేది. అటవీహక్కుల చట్టం అమలులోకి వచ్చిన తర్వాత అటవీ భూములను సాగు చేస్తున్న గిరిజనులకు హక్కు పత్రాలు అందజేశారు.
- 2005కు ముందు అటవీ భూములను సాగు చేసిన అర్హులైన గిరిజనులందరికీ వాటిని పంపిణీ చేసే చారిత్రాత్మక నిర్ణయాలను వైఎస్ తీసుకున్నారు. ఇందులో భాగంగానే ఏజెన్సీలోని 11 మండలాల పరిధిలో 60 వేల ఎకరాల అటవీ భూములకు భూహక్కు పత్రాలను మంజూరు చేశారు. 2009 జూలై 12వ తేదీన పాడేరు పాలిటెక్నిక్ కళాశాల ప్రాంగణంలో వైఎస్ పంపిణీ చేశారు. అప్పట్లో అటవీ భూములకు హక్కు పత్రాలు పొందిన గిరిజనులంతా ఆయనను గుండెల్లో పెట్టుకుని కొలుచుకుంటున్నారు.
- మన్యంలో సుమారు లక్ష కుటుంబాలకు ఇందిరమ్మ పథకంలో పక్కా గృహాలను కట్టించిన ఘనత కూడా దివంగత సీఎం వైఎస్‌కు దక్కుతుంది. మట్టిగోడలతో పూరిగుడిసెల్లో దుర్భర జీవనం గడిపే గిరిజనులుకు సొంతింటి కలను నెరవేర్చారు.
- సంక్షేమ కార్యక్రమాలతో పాటు మౌలిక వసతులకు వైఎస్ ప్రాధాన్యమిచ్చారు. తాగు నీరు, సీసీ రోడ్లు, విద్యుత్ వంటి మౌలిక సదుపాయాలు కల్పించారు.

చలించిన వైఎస్..

- గిరిజనులంటే అమితమైన అభిమానంతో గిరిజన సంక్షేమ పథకాలు, కార్యక్రమాలను ఐటీడీఏ ద్వారా పెద్ద ఎత్తున చేపట్టారు.2005లో అరకులోయ మండలం కోడిపుంజువలసలో కొండచరియలు విరిగిపడి గ్రామమంతా వరదలో కొట్టుకుపోయింది. ఈ ఘటనపై చలించిన సీఎం వైఎస్ అరకులోయ ప్రాంతానికి హెలికాప్టర్‌లో వచ్చారు. ప్రభుత్వ యంత్రాంగంతో మృతదేహాలను వెలికితీయించడంతో పాటు సహాయ కార్యక్రమాలను పర్యవేక్షించారు. ఈ ఘటనలో 17 మంది గిరిజనులు మృతిచెందగా, నలుగురు గల్లంతయ్యారు.
- బాధిత కుటుంబాలకు పెద్ద మొత్తంలో ఆర్థిక సహాయం అందజేశారు. పశువులను కొనుగోలు చేసి పంపిణీ చేశారు.76 కుటుంబాలకు శ్లాబ్ ఇళ్లతో మోడల్ కాలనీని అన్ని సౌకర్యాలతో నిర్మించారు.
- కొండ దిగువన ఉన్న గ్రామాలను గుర్తించి ఆయా గిరిజన కుటుంబాలకు అనువైన స్థలంలో మోడల్ కాలనీల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఇప్పటికీ కోడిపుంజువలసలోని ప్రతి ఇంట్లో ఆయన ఫొటో పెట్టుకుని దేవుడిలా కొలుచుకుంటున్నారు.



పాడేరులో వైఎస్ నాటిన మొక్క నేడు వృక్షమై..



కోడిపుంజువలసలో వరద బాధితులను ఆదుకునేందుకు వచ్చిన వైఎస్సార్

అటవీ హక్కు వైఎస్ చలవే



ఆదివాసీలకు వైఎస్సార్ ఎంతో మేలు చేశారు. సాగు చేసుకుంటున్న అటవీ భూములపై హక్కు కల్పిస్తూ పట్టాలు పంపిణీ చేశారు. ఈ రోజు ఎంతో సంతోషం చేసుకుంటున్నామంటే ఆయన చలవే. మా గ్రామానికి పక్కా రోడ్డు ఆయనే మంజూరు చేశారు.

– పాంగి భీమేశ్వరరావు, డల్లాపల్లి, పాడేరు మండలం

పెద్దాయన మాకు దేవుడు



కొండ చరియలు విరిగి పడి కొట్టుకుపోయిన కోడిపుంజువలస బాధితులను వైఎస్ ఆదుకున్నారు. నష్టపరిహారం అందించారు. పక్కా ఇళ్లు నిర్మించి ఇచ్చారు. అన్ని విధాలుగా ఆదుకున్నారు. అందుకే ఆయన్ని దేవుడిలా కొలుస్తున్నాం.

– కొర్రా భీమన్న, కోడిపుంజువలస, అరకులోయ మండలం

స్పందనకు వినతుల వెల్లువ

- 76 అర్జీల స్వీకరణ
- పరిష్కారానికి పీవో అభిషేక్ ఆదేశాలు



గిరిజనుల నుంచి వినతులు స్వీకరిస్తున్న ఐటీడీఏ పీవో వి.అభిషేక్,ఇతర అధికారులు

సాక్షి,పాడేరు: స్థానిక ఐటీడీఏలో శుక్రవారం నిర్వహించిన స్పందనకు వినతులు వెల్లువెత్తాయి. ఐటీడీఏ పీవో వి.అభిషేక్ గిరిజనుల నుంచి వ్యక్తిగత, సామాజిక సమస్యలపై 76 వినతులను స్వీకరించారు. అనంతరం ఆయన అధికారులతో సమీక్షించారు. అర్జీలను క్షేత్రస్థాయిలో పరిశీలించి యుద్ధ ప్రాతిపదికన పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. డీఆర్వో పి.అంబేద్కర్,ఐటీడీఏ ఏపీవో వి.ఎస్.ప్రభాకరరావు, ఎస్‌డీసీ వి.వి.ఎస్.శర్మ, డీఎంహెచ్‌వో జమాల్‌బాషా, పలు ఇంజనీరింగ్‌శాఖల ఈఈలు డి.వి.ఆర్.ఎం.రాజు, లావణ్యకుమార్, కొండయ్యపడాల్, డీఆర్‌డీఏ పీడీ మురళీ, ఎల్‌డీఎం రవితేజ, కాఫీ ఏడీ వి.మురళీ, గురుకుల విద్యాలయాల సమన్వయకర్త పీఎస్ ఎన్.మూర్తి తదితరులు పాల్గొన్నారు.

అర్జీల్లో కొన్ని..

- విద్యుత్ సదుపాయం,ఉచిత వ్యవసాయ బోరును ఏర్పాటు చేయాలని అనంతగిరి మండలం గుమ్మకోట పంచాయతీ,భీమవరం గ్రామస్తుడు అప్పలస్వామి వినతిపత్రం అందజేశాడు.
- జి.మాడుగుల మండలం సొలభం పంచాయతీ వంజంగిపాడు మీదుగా పెదపినపాలెం,గానుగరోలు గ్రామం వరకు రోడ్డు నిర్మించాలని గిరిజనులు కోరారు.
- చింతపల్లి మండలం అంజలిశనివారం పంచాయతీ కొట్లగరువు గ్రామానికి సీసీరోడ్డు, కమ్యూనిటీ హాల్‌ను మంజూరు చేయాలని వినతి పత్రం అందజేశారు.
- ముంచంగిపుట్టు మండలం లక్ష్మీపురం పంచాయతీ,ఉబ్బెంగుల గ్రామానికి రోడ్డుతో పాటు గెడ్డపై వంతెన నిర్మాణాలు చేపట్టాలని గ్రామస్తులు వి.సుబ్బారావు,వి.గురుమూర్తి కోరారు.
- డుంబ్రిగుడ మండలం కురిడి పంచాయతీ, గదబగరువు,జి.బలియగుడ గ్రామాలకు కొత్తగా అంగన్‌వాడీ కేంద్రాలు మంజూరు చేయాలని ఎంపీటీసీ వి.రాజేశ్వరి,సర్పంచ్ బి.అచ్చులు ఐటీడీఏ పీవోను కోరారు.
- హుకుంపేట మండలం బూర్జ పంచాయతీ కేంద్రం నుంచి జాకరవలస మీదుగా తుంబవలస, వై.సల్తంగి గ్రామాల వరకు రోడ్డు నిర్మించి, గిరిజనులకు రవాణా సౌకర్యాలు అందుబాటులోకి తేవాలని ఎంపీటీసీ మజ్జి హరి కోరారు.

256 గ్రామాల్లో భూ రీసర్వే పూర్తి

రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ కేజియా కుమారి



సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ డైరెక్టర్ కుమారి

రంపచోడవరం: ఏజెన్సీలోని జగనన్న భూ హక్కు–భూ రక్ష పథకంలో ఇప్పటివరకు ఏడు మండలాల పరిధిలోని 256 గ్రామాల్లో రీసర్వే పూర్తయిందని రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ సర్వే కేజియాకుమారి తెలిపారు. ఏజెన్సీలోని భూసర్వేపై అధికారుల, సిబ్బందితో స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సర్వే చేసిన భూములకు సంబంధించి తప్పులు లేకుండా పక్కాగా రికార్డులు తయారు చేసి అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. సర్వే చేసిన భూములకు రికార్డులు తయారు చేయడంలో ఎదురైన సమస్యలపై మండలాల వారీగా తెలుసుకున్నారు. సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఏజెన్సీలోని భూములన్నింటికి ప్రభుత్వ నిబంధనల ప్రకారం రైతులకు సంబంధించిన భూముల్లో రైతులు ఇరువురి మధ్య హద్దులు ఏర్పాటుచేయాలని సూచించారు. సర్వే చేసిన భూముల్లో ఎదురైన సమస్యలను ఐటీడీఏ పీవో సూరజ్‌గనోరే, రంపచోడవరం సబ్ కలెక్టర్ శుభం బన్సల్ దృష్టికి తీసుకువెళ్లామన్నారు. రీ సర్వే ప్రత్యేక అధికారి ఉదయభాస్కర్, డీఎస్‌ఎల్‌వో మోహనరావు, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ కె. దేవేంద్రుడు, డిప్యూటీ సర్వే ఆఫ్ ఇన్‌స్పెక్టర్లు రాజశేఖర్, బాబూరావు, రవిశంకర్, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తపై టీడీపీ సర్పంచ్ దాడి

- గుడిసె టోల్‌గేట్ ఆదాయ వివరాలు అడిగినందుకు తిరుగుబాటు
- ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడు
- పరామర్శించిన ఎమ్మెల్యే ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంత్ ఉదయభాస్కర్



చికిత్స పొందుతున్న వైఎస్సాసర్ సీపీ కార్యకర్తను పరామర్శిస్తున్న ధనలక్ష్మి, అనంత్ ఉదయ్‌భాస్కర్

రంపచోడవరం: మారేడుమిల్లి మండలం పుల్లంగి టీడీపీ సర్పంచ్ వి. జార్జిబాబు అదే గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త కె.దేవరాజుపై దాడికి పాల్పడ్డాడు. గాయపడిన అతను రంపచోడవరం ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. అతనిని ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంత్ ఉదయ్‌భాస్కర్ శుక్రవారం రాత్రి పరామర్శించారు. ఈ దాడికి సంబంధించి వివరాలను వారి దృష్టికి పుల్లంగి గ్రామస్తులు తీసుకువెళ్లారు. గుడిసె పర్యాటక ప్రాంతానికి సంబంధించి టోల్ గేట్ ద్వారా వసూలు చేసిన డబ్బులకు సరైన లెక్కలు చెప్పాలని గ్రామస్తులు గురువారం జరిగిన గ్రామసభలో నిలదీశారు. ఈ సమయంలో గొడవ జరిగింది. ప్రశ్నించిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త దేవరాజుపై సర్పంచ్ జార్జిబాబు దాడికి పాల్పడ్డాడని వారు వివరించారు. అటవీశాఖ, పుల్లంగి పంచాయతీ నిర్వహిస్తున్న గుడిసె టోల్ గేట్ ద్వారా సుమారు రూ.1.20 కోట్లకు పైగా ఆదాయం వచ్చిందని వారు పేర్కొన్నారు. వీటిలో అటవీశాఖ అధికారులు రూ.10 లక్షలు, పంచాయతీ రూ. 5లక్షలు ఎటువంటి లెక్కలు చూపకుండా వాడేసారని వారు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీకి వివరించారు. గురువారం జరిగిన గ్రామసభలో ఎటువంటి వివరాలు తెలియజేయని సర్పంచ్ తిరిగి తనపై వైఎస్సార్‌సీపీ నేతలు దాడి చేశారని తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని వారి దృష్టికి గ్రామస్తులు తీసుకువెళ్లారు. టోల్‌గేట్ ద్వారా వచ్చిన ఆదాయంలో పుల్లంగి గ్రామ అభివృద్ధికి ఒక్క రూపాయి ఖర్చు చేయలేదన్నారు.దీనిపై పూర్తి విచారణ జరిపేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు హామీ ఇచ్చారు. బాధితుడిని పరామర్శించిన వారిలో జెడ్పీటీసీ గొర్లె బాలాజీబాబు, వైఎంపీపీ లక్కోండ రవికుమార్, దూడ స్మిత్ తదితరులు ఉన్నారు.

కూలిన పాఠశాల భవనం శ్లాబ్



కూలిన జీపీఎస్ పాఠశాల భవనం వద్ద గ్రామస్తులు



మొండికోటలో కూలిన పాఠశాల భవనం శ్లాబ్

- రాత్రివేళ కావడంతో తప్పిన పెను ప్రమాదం
- మొండికోటలో ఘటన

పెదబయలు: మండలంలోని పెదకోడాపల్లి పంచాయతీ మొండికోటలో జీపీఎస్ పాఠశాల భవనం శ్లాబ్ కొంత భాగం కూలిపోయింది. సుమారు 20 ఏళ్ల క్రితం నిర్మించిన ఈ భవనం ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకుంది. వర్షం కురిసినప్పుడు ఈ భవనంలో తరగతులు నిర్వహించడం లేదు. ఈ పాఠశాలల్లో ఐదవ తరగతి వరకు సుమారు 22 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఈనేపథ్యంలో ఈనెల 31వ తేదీ రాత్రి పాఠశాల భవనం వరండా శ్లాబ్ కూలిపోయింది. రాత్రి వేళల్లో జరగడం వల్ల పెను ప్రమాదం తప్పింది. పాఠశాల భవనం శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారిందని గతంలో మండలవిద్యాశాఖ అధికారుల దృష్టికి తీసుకువెళ్లామని గ్రామస్తులు తెలిపారు. వర్షం కురిసినప్పుడు పక్కనే ఉన్న రేకుల షెడ్డులో తరగతులు నిర్వహిస్తున్నారని వారవి వివరించారు. దీనిపై స్థానిక ఎంఈవో–1 కృష్ణమూర్తిని వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఫోన్‌కు అందుబాటులో లేరు. పెదకోడాపల్లి సీఆర్‌పీ మత్స్యరాజును వివరణ కోరగా మన బడి నాడు–నేడు పేజ్–3లో పాఠశాల భవనం మంజూరైందని తెలిపారు.

కౌలు రైతులకు రూ.11.55 లక్షల లబ్ధి



రైతులకు చెక్కులు పంపిణీ చేస్తున్న జాయింట్ కలెక్టర్ శివశ్రీనివాస్ తదితరులు

సాక్షి, పాడేరు: జిల్లాలో 154 మంది కౌలురైతుల ఖాతాల్లో రూ.11.55 లక్షలు సీఎం జగన్‌మోహన్ రెడ్డి జమ చేశారని జాయింట్ కలెక్టర్ శివశ్రీనివాస్ వెల్లడించారు. శుక్రవారం తాడేపల్లి సీఎం క్యాంపు కార్యాలయం నుంచి కౌలురైతుల పెట్టుబడి సాయం విడుదల ప్రత్యక్ష ప్రసారాన్ని కలెక్టర్ కార్యాలయం నుంచి వీక్షించారు. అనంతరం కౌలు రైతులకు నమూనా చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లావ్యవసాయ సలహా మండలి అధ్యక్షురాలు ఎం.సరస్వతి, జిల్లా వ్యవసాయాధికారి ఎస్‌బీఎస్.నంద్, జిల్లా ఉద్యానవన అధికారి రమేష్‌కుమార్ పాల్గొన్నారు.

తొలిరోజు 61.86 శాతం పింఛన్ల పంపిణీ



కొత్త పింఛను అందుకుంటున్న లబ్ధిదారుడు

సాక్షి,పాడేరు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలుజేస్తున్న వైఎస్సార్ పింఛన్ కానుక జిల్లాలో శుక్రవారం తొలిరోజు 61.86శాతం మేర పంపిణీ చేశారు. అర్హులైన 2800మంది కొత్త వారికి ఈనెల నుంచి సామాజిక పింఛన్ల సొమ్ము రూ.81లక్షల 8వేల 250 ప్రభుత్వం మంజూరు చేసింది. జిల్లాలో 1,25,164 మంది పింఛనుదారుల్లో తొలిరోజు 77,428 మందికి వలంటీర్లు అందజేశారు. కూనవరం, వీఆర్‌పురం, ఎటపాక మండలాల్లో పింఛన్ల పంపిణీ చురుగ్గా సాగుతోంది.

వాడవాడలా వైఎస్ వర్థంతి నిర్వహించాలి


సాక్షి,పాడేరు: దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి వర్థంతి జిల్లాలోని అన్ని మండలాల్లో పార్టీ శ్రేణులు, అభిమానులు సేవా కార్యక్రమాలతో నిర్వహించాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి పిలుపునిచ్చారు. స్థానిక పాతబస్టాండ్‌లోని డాక్టర్ వైఎస్సార్ విగ్రహం వద్ద శనివారం ఉదయం 9.30 గంటలకు నిర్వహించే వర్థంతి కార్యక్రమానికి స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు హాజరు కావాలని ఆమె కోరారు.

మంచు.. ఎండ.. వాన

- ఒకేరోజు మూడు కాలాలు
- పాడేరు పరిసరాల్లో భిన్న వాతావరణం



పాడేరులో కురుస్తున్న పొగమంచు



ఎండ తీవ్రతకు నిర్మానుష్యంగా రోడ్డు



పాడేరులో సాయంత్రం కురుస్తున్న వర్షం

సాక్షి,పాడేరు: మన్యంలో భిన్న వాతావరణం నెలకొంది.ఉదయం పొగమంచు, మధ్యాహ్నం వరకు ఎండతీవ్రత, ఆ తరువాత జోరువాన.. ఇలా శుక్రవారం మూడు కాలాలు తలపించింది. అర్ధరాత్రి నుంచి ఉదయం 8 గంటల వరకు పొగమంచు దట్టంగా కురిసింది. మినుములూరు కేంద్ర కాఫీబోర్డు వద్ద 18 డిగ్రీలకు ఉష్ణోగ్రత నమోదైంది. మధ్యాహ్నం 2 గంటల వరకు భానుడు ప్రతాపం చూపడంతో జనసంచారం తగ్గింది. సంతలో చిరువ్యాపారులు, గిరిజనులు ఎండను తాళలేక గొడుగులను ఆశ్రయించారు. మధ్యాహ్నం మూడు గంటల తరువాత వాతావరణం ఒక్కసారిగా మారి భారీగా వర్షం కురిసింది.

సాక్షి మీడియా గ్రూప్, ఆర్‌సీ ఎగ్జామ్స్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో

గ్రూప్–2 ఉద్యోగ పరీక్షలపై రేపు ఉచిత అవగాహన సదస్సు

- 3వ తేదీ ఉదయం 9 నుంచి 12.30 వరకు
- టాలెంట్ టెస్ట్‌లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు నగదు బహుమతులు, ప్రామాణిక స్టడీ మెటీరియల్

సాక్షి ఎడ్యుకేషన్ : ఆంధ్రప్రదేశ్‌లో భారీ ఎత్తున గ్రూప్–2 ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వం చర్యలు చేపడుతుంది. దాదాపు 1000 వరకు గ్రూప్–2 ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయనుంది. ఈ నేపథ్యంలో.. గ్రామీణ విద్యార్థులను ప్రభుత్వ ఉద్యోగులుగా తీర్చిదిద్దే లక్ష్యంతో.. సాక్షిఎడ్యుకేషన్.కామ్ రాష్ట్రంలోని ప్రముఖ పోటీ పరీక్షల సంస్థ ఆర్.సి ఎగ్జామ్స్‌తో కలిసి ఈనెల 3వ తేదీ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు విశాఖలోని రామాటాకీస్ దరి రీజనల్ కంటి ఆస్పత్రి ఎదురుగా గల డా.బి.ఆర్.అంబేద్కర్ భవన్‌లో ఉచిత అవగాహన సదస్సు నిర్వహించనున్నారు. గత కొన్ని సంవత్సరాలుగా వివిధ పోటీపరీక్షలకు ప్రిపేరయ్యే అభ్యర్థులకు సాక్షిఎడ్యుకేషన్.కామ్ తోడుగా ఉంటున్న విషయం మీ అందరికి తెల్సిందే. త్వరలోనే వెయ్యికి పైగా గ్రూప్ 2 ఉద్యోగాలకు నోటిఫికేషన్ రానుండటం.. దీనికి తోడు గ్రూప్–2కు కొత్త సిలబస్‌ను ప్రకటించిన నేపథ్యంలో ఈ అవగాహన సదస్సు విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడనుంది. అవగాహన సదస్సు, టాలెంట్ టెస్ట్‌కు హాజరయ్యే విద్యార్థులు ముందుగా 8985094499 ఫోన్ నెంబర్‌కు తమ పేరు, ఫోన్ నెంబర్, జిల్లా వివరాలను వాట్సాప్‌లో పంపాలి.

వేదిక:
డా.బి.ఆర్.అంబేద్కర్ భవన్,
రామాటాకీస్ దరి రీజనల్
కంటి ఆస్పత్రి ఎదురుగా విశాఖపట్నం

సమయం :
ఉదయం 9 నుంచి 12.30 వరకు

వివరాలు పంపించాల్సిన ఫోన్ నెంబర్ 8985094499

క్లుప్తంగా

300 మందికి వైద్య పరీక్షలు


రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

దేవీపట్నం: ఏపీ జెన్‌కో, మేఘా ఇంజినీరింగ్ సంస్థ సిబ్బంది ఆధ్వర్యంలో పోలవరం జలవిద్యుత్తు కేంద్రం సమీపంలో గల పూడిపల్లి పంచాయతీ అంగుళూరులో శుక్రవారం వైద్యశిబిరం నిర్వహించారు. రాజమండ్రికి చెందిన మోహన్ డయాబెటిక్ సెంటర్, నేత్రాలయ కంటి ఆస్పత్రి, స్రవంతి మల్టీ స్పెషాలిటీ డెంటల్ హాస్పిటల్‌కు చెందిన వైద్యులు రోగులకు వైద్య పరీక్షలు చేశారు. శిబిరంలో సుమారు 300 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్టు నిర్వాహకులు తెలిపారు. ఏపీజెన్‌కో ఈఈలు ఎస్.సూర్యనారాయణ, వై.భీమధనరావు, సి.హనుమ, మేఘా ఇంజినీరింగ్ సంస్థ జనరల్ మేనేజర్ పి.శంకర్, సిబ్బంది పాల్గొన్నారు.

కోట్నాపల్లి వీఆర్వో మృతి


వెంకటరమణ (ఫైల్)

హుకుంపేట: కొట్నాపల్లి వీఆర్వో వెంకటరమణ(40) మృతి చెందారు. విధులు నిర్వహిస్తుండగా ఆయనకు గుండెపోటు రావడంతో కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశానుసారం హుటాహుటిన విశాఖపట్నంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్టు కుటుంబీకులు తెలిపారు. మృతుడు వెంకటరమణ స్వగ్రామం పాడేరు మండలం దేవపురం. ఆయనకు నలుగురు పిల్లలు, భార్య ఉన్నారు. ఆయన మృతికి పలువురు సంతాపం తెలిపారు.

ఆరోగ్యవంతమైన సమాజానికి కృషి


అడ్డతీగలలో మాట్లాడుతున్న పీడీ సూర్యలక్ష్మి


రాజవొమ్మంగిలో వైఎస్సార్ సంపూర్ణ పోషణ్ కిట్లను అందజేస్తున్న ఐసీడీఎస్ పీడీ సూర్యలక్ష్మి

ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ సూర్యలక్ష్మి

రాజవొమ్మంగి: తల్లి, బిడ్డలు రక్తహీనతకు గురికాకుండా ఆరోగ్యం పట్ల వారికి అంగన్‌వాడీ కార్యకర్త పూర్తి అవగాహన కల్పించాలని స్త్రీ శిశు సంక్షేమ ప్రాజెక్టు డైరెక్టర్ ఎన్.సూర్యలక్ష్మి కోరారు. స్థానిక ఐసీడీఎస్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం ఎంపీపీ గోము వెంకటలక్ష్మి అధ్యక్షతన జరిగిన పౌష్టికాహార వారోత్సవాల ప్రారంభ సమావేశానికి ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన సమాజం కోసం ప్రతి కార్యకర్త బాధ్యతాయుతంగా పని చేయాలని ఆదేశించారు. ప్రభుత్వం అందిస్తున్న వైఎస్సార్ సంపూర్ణ పోషణ్ కిట్లను లబ్ధిదారుల ఇంటికీ సక్రమంగా, సకాలంలో అందజేయాలన్నారు. కార్యక్రమంలో భాగంగా వెల్ బేబీ షోకు సంబంధించి 10 నెలలకు 10 కిలోల బరువు తూగిన చంటిబిడ్డకు ఆమె బహుమతి అందజేశారు. పౌష్టికాహార స్టాల్‌ను ప్రారంభించారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 3,214 మిని, మెయిన్ అంగన్‌వాడీ కేంద్రాలున్నట్టు తెలిపారు. 10,949 మంది గర్భిణులు, 11,105 మంది బాలింతలు ఉన్నారని పీడీ వివరించారు. వీరందరికి టేక్ హోం రేషన్ క్రమం తప్పకుండా అందేలా అన్ని చర్యలు తీసుకొంటున్నామన్నారు. ఎఫ్ఆర్ఎస్ యాప్ (ఫేస్ రికగ్నిషన్) ద్వారా లబ్ధిదారులకు సరకులు అందజేస్తుండడంతో ఎక్కడా అవకతవకలకు ఆస్కారం లేదన్నారు. గడుఓకుర్తి పంచాయతీ పరిధిలోని నాలుగు అంగన్‌వాడీ సెంటర్లు గతంలో లాగరాయి క్లస్టర్‌లో ఉండేవని, వాటిని చెరకుంపాలెం క్లస్టర్‌లో చేర్చడం వల్ల దూరం భారం పెరిగిందని పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలు పీడీ దృష్టికి తెచ్చారు. పీడీ సానుకూలంగా స్పందించి ఆ మేరకు చర్యలు తీసుకొంటానని హామీ ఇచ్చారు. ముఖ్య అతిథిగా ఎంపీపీ గోము వెంకటలక్ష్మి హాజరు కాగా వైస్ ఎంపీపీ చంద్రరాణి, ఎంపీటీసీ సభ్యురాలు గంగదుర్గ, సీడీపీఓ దేవమణి పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

అడ్డతీగల: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందించే పౌష్టికాహారాన్ని సక్రమంగా తీసుకుని ఆరోగ్యంగా ఉండాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ సూర్యలక్ష్మి అన్నారు. అడ్డతీగల ప్రాజెక్టు పరిధిలో పౌష్టికాహార మాసోత్సవాల సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆమె శుక్రవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్థానికంగా లభించే ఆకుకూరలు, చిరుధాన్యాలు, పండ్లు ప్రతిరోజు ఆహారంలో భాగంగా తీసుకోవాలని వివరించారు. సీడీపీవో దీప్తి మాట్లాడుతూ ఆరోగ్యంగా ఉండేందుకు సమతుల్య ఆహారాన్ని తీసుకోవాలన్నారు. పోషకాలు ఎక్కువగా లభించే ఆహారపదార్థాల గురించి వివరించారు. పోషకార మాసోత్సవాలు ఈ నెల 9వ జరుగుతాయని షెడ్యూల్ ప్రకారంగా గ్రామస్థాయిలో అవగాహన సదస్సులు, ర్యాలీల ద్వారా లబ్ధిదారులు, గ్రామస్తులకు వివరించాలని అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచించారు. ఆరోగ్యవంతమైన ఇద్దరు పిల్లలను ఎంపిక చేసి ప్రథమ, ద్వితీయ బహుమతులు అందజేశారు. చిరుధాన్యాలతో తయారు చేసిన ఆహార పదార్థాల స్టాల్స్ ఏర్పాటు చేశారు. ఉప సర్పంచ్ ముప్పన శెట్టిబ్ శ్రీను, ఎంపీటీసీ సభ్యురాలు వడ్లమూరి రత్నం తదితరులు పాల్గొన్నారు.

మూగజీవాలకు వ్యాక్సిన్ తప్పనిసరి


అరకులోయలో మాట్లాడుతున్న జిల్లా పశు సంవర్ధకశాఖ ప్రత్యేకాధికారి చంద్రమౌళి నాయక్


డుంబ్రిగుడలో రికార్డులు పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి చంద్రమౌళి నాయక్

అరకులోయ రూరల్: ప్రభుత్వ ఆదేశాల మేరకు మూగజీవాలకు వ్యాక్సిన్ తప్పనిసరిగా వేయాలని పశుసంవర్ధక శాఖ జిల్లా ప్రత్యేక అధికారి చంద్రమౌళి నాయక్ అన్నారు. అరకులోయ ప్రాంతీయ పశుసంవర్ధక శాఖ కార్యాలయంలో అరకులోయ, డుంబ్రిగుడ, అనంతగిరి మండల సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోని పశువులకు, మేక, గొర్రెలకు వ్యాక్సినేషన్ వేయడంతో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని దీని ద్వారా వ్యాధుల వ్యాప్తి తగుముఖం పడుతుందన్నారు. గ్రామాల్లో సక్రమంగా విధులు నిర్వహించి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. వ్యాధుల పట్ల అందరు అప్రమతంగా ఉండి సేవ చేయాలన్నారు. లంపి స్కిన్ వ్యాధిపై గ్రామాల్లో అవగాహన కల్పించి వ్యాక్సిన్లు వేయాలని ఆదేశించారు. రికార్డులు నిర్వహణ సక్రమంగా ఉండేలా చూడాలని ఆయన ఆదేశించారు. శాఖ డీడీ నరసింహులు, ఏడీ రాజ రవికుమార్, వెటర్నరీ వైద్యులు గణేశ్వరరావు, రాజశ్రీ, సిబ్బంది సాంబ, సుబ్బారావు, దివ్య తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం తగదు

డుంబ్రిగుడ: విధుల పట్ల నిర్లక్ష్యం చేయకుండా విధులు నిర్వర్తించాలని రికార్డులు ఎప్పటికప్పుడు రాస్తుండాలని పశుసంవర్ధక శాఖ జిల్లా ప్రత్యేక అధికారి చంద్రమౌళి నాయక్ అన్నారు. మండలంలోని కించుమండ, డుంబ్రిగుడ పశుసంవర్ధక శాఖ కార్యాలయాలను ఆయన శుక్రవారం సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువులు, మేకలు, గొర్రెలకు తప్పనిసరిగా వ్యాక్సిన్లు వేయాలని ఆదేశించారు. పాడేరు డీడీ నరసింహులు,ఏడీ రాజ రవికుమార్,వైద్యులు గణేష్ ,రాజశ్రీ తదితరులు పాల్గొన్నారు.

భర్తను హత్య చేసిన భార్య


గొడ్డలిని పరిశీలిస్తున్న పోలీసులు


కృష్ణారావు మృతదేహం

వేధింపులతో విసిగిపోయి గొడ్డలితో దాడి

గూడెంకొత్తవీధి: మద్యానికి బానిసై అనుమానంతో నిత్యం వేధింపులకు గురిచేస్తుండడంతో తట్టుకోలేని ఓ భార్య.. భర్తను హత్యచేసిన సంఘటన జీకే వీధి మండలం సప్పర్లలో జరిగింది. జీకే వీధి సీఐ అశోక్‌కుమార్, సీలేరు ఎస్ఐ జె.రామకృష్ణ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. సప్పర్లకు చెందిన కొర్ర కృష్ణారావు, వీరమ్మ భార్యా భర్తలు. భార్యపై అనుమానంతో కృష్ణారావు నిత్యం తాగి వచ్చి వేధించేవాడు. దీంతో ఇద్దరి మధ్య గొడవలు జరుగుతుండేవి. బుధవారం రాత్రి కూడా వారు గొడవ పడ్డారు. వేధింపులు భరించలేక అక్కడే ఉన్న గొడ్డలితో భర్త తలపై భార్య వీరమ్మ కొట్టింది. దీంతో స్పృహ తప్పిపోయిన కృష్ణారావును చికిత్స కోసం నర్సీపట్నం తీసుకెళ్లారు. ఫలితం లేకపోయిందని ఆస్పత్రిలో గురువారం కృష్ణారావు మరణించాడని సీఐ, ఎస్ఐ చెప్పారు. హత్యకు పాల్పడిన భార్య వీరమ్మను అరెస్టు చేశామని వారు తెలిపారు.

ఉపాధి కోర్సుల్లో ఉచిత శిక్షణ

- ఉపాధి హామీ వేతనదారుల పిల్లలకు ఉద్యోగ అవకాశాలు
- ఏపీడీ గిరిబాబు

పాడేరు రూరల్ : ఉపాధి హామీ పథకంలో వేతనదారుల పిల్లలకు ఉన్నతి ప్రాజెక్టు ద్వారా పలు రంగాల్లో శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని ఉపాధి హామీ పథకం ఏపీడీ జె.గిరిబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు 2018–2023 ఆర్థిక సంవత్సరాల్లో 100 రోజుల పని దినాలు పూర్తి చేసిన వేతనదారుల కుటుంబాల పిల్లలకు ఉన్నతి కార్యక్రమం ద్వారా ఉచిత శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఈనెల 4న పాడేరులో జాబ్ డ్రైవ్ నిర్వహిస్తామన్నారు. మూడు నెలల పాటు కంప్యూటర్, మెకానిక్, ప్లంబింగ్, ఎలక్ట్రానిక్స్, హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్, ఫార్మా తదితర కోర్సులపై శిక్షణ ఇస్తామన్నారు. శిక్షణ పొందేందుకు టెన్త్, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ డిప్లొమో, బీటెక్ అర్హత కలిగి ఉండాలన్నారు. 18 నుంచి 35 ఏళ్ల మధ్య వయస్సు ఉన్న వారు అర్హులని, శిక్షణ కాలంలో ప్రతి అభ్యర్థికి రోజుకు రూ.272లు అందజేస్తామన్నారు. జి.మాడుగుల, పాడేరు, హుకుంపేటకు చెందిన ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 4న పాడేరు వెలుగు కార్యాలయంలో, ముంచంగిపుట్టు, పెదబయలు మండలాలకు చెందిన వారు 6న పెదబయలు వెలుగు కార్యాలయంలో, డుంబ్రిగూడ, అరకు, అనంతగిరి మండలాలకు చెందిన అభ్యర్థులు 8న అరకు వెలుగు కార్యాలయంలో, చింతపల్లి, జీకే వీధి, కొయ్యూరు మండలాలకు చెందిన అభ్యర్థులు ఈనెల 11న చింతపల్లి వెలుగు కార్యాలయంలో హాజరు కావాలని సూచించారు. మరిన్ని వివరాలకు ఉపాధి హామీ పథకం కార్యాలయాల్లో సంప్రదించాలన్నారు.

శ్రీనివాసునికి అభిషేక సేవ


పూజల్లో పాల్గొన్న అర్చకులు, భక్తులు

రంపచోడవరం: తిరుమల తిరుపతి దేవస్థానం గోవిందగిరి దివ్యక్షేత్రంలో శ్రీనివాసుడికి శుక్రవారం అభిషేకసేవను ఆలయ అర్చకులు పార్థస్వామి, మణికంఠస్వామి నిర్వహించారు. ఘనపాటి రామసాయి శర్మ వేదపారాయణం చేశారు. ఈసేవలో ఆలయ అధికారులు నారాయణరాజు, గిరిబాబు సిబ్బంది, భక్తుల, డీపీపీ కోఆర్డినేటర్ నల్లమిల్లి వెంకట రామారెడ్డి, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ బ్రాంచ్ మేనేజర్ మురళీ మోహన్ పాల్గొన్నారు. ఇలావుండగా స్థానిక సంతమార్కెట్‌లో కొలువైన వరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో వినాయ చవితి పురస్కరించుకుని శుక్రవారం పాల రాట వేశారు. ధర్మప్రచార సేవా భక్త బృందం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

కార్యకర్తలకు పార్టీ అండ

వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు, ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

సాక్షి,పాడేరు: కష్టపడి పనిచేసే కార్యకర్తలు, నాయకుల సంక్షేమానికి పార్టీ అధ్యక్షుడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అన్నివిధాలుగా అండగా ఉంటున్నారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. శుక్రవారం తన కార్యాలయంలో పాడేరు మండలంలోని గృహసారధులు, సచివాలయాల కన్వీనర్లతో సమావేశం నిర్వహించారు. బీమా, యాప్‌ల వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సచివాలయాల కన్వీనర్లు,గృహసారధులంతా తమ పరిధిలో ప్రభుత్వ పథకాలపై విస్తృత ప్రచారం చేయాలన్నారు.కష్టాల్లో ఉన్న కార్యకర్తలకు సీఎం అండగా నిలుస్తున్నారన్నారు. నియోజకవర్గంలోని ఇద్దరు ఎంపీటీసీ సభ్యులు అనారోగ్య సమస్యలతో మృతిచెందితే తమ వినతి మేరకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పెద్ద మొత్తంలో ఆర్థికసాయం అందజేసి ఆదుకున్నారన్నారు. రెండోసారి పార్టీ అధ్యక్షురాలిగా ఎన్నికైన ఆమెను పలువురు అభినందించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ కూతంగి సూరిబాబు, సచివాలయాల మండల కన్వీనర్ కిముడు కోటిబాబు పాల్గొన్నారు.

ఎస్ఐపీలో గిరిజన విద్యార్థుల ప్రతిభ


విద్యాశాఖ ఉన్నతాధికారి సురేష్‌కుమార్ చేతుల మీదుగా బహుమతి, నగదు అందుకుంటున్న పెదబయలు ఆశ్రమ పాఠశాల విద్యార్థులు

పెదబయలు: విజయవాడలో ఆగస్టు 28 నుంచి 30వ తేదీ వరకు జరిగిన రాష్ట్ర స్థాయి స్కూల్ ఇన్నోవేషన్ ప్రోగ్రాం(ఎస్ఐపీ) గ్రాండ్ ఫినాలేలో అల్లూరి జిల్లా పెదబయలు మండల గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. తమ పాఠశాల విద్యార్థుల తయారుచేసిన ప్రాజెక్టులు ఎంపిక కావడం బహుమతులు అందుకోవడం ఆనందంగా ఉందని హెచ్ఎం, జిల్లా సైన్స్ అధికారి టి.నాగేశ్వరరావు చెప్పారు. ఈ పోటీల్లో సుమారు 3268 ప్రాజెక్టులు ప్రదర్శించగా, అందులో ఫైనల్స్‌కు 26 ప్రాజెక్టులు ఎంపిక కాగా, వాటిలో నాలుగో స్థానంలో తమ పాఠశాలలో 8వ తరగతికి చెందిన వి.చంద్రశేఖర్, పి.అవినాష్ విద్యార్థులు రూపొందించిన ఇన్సలేటెడ్ ఎలక్ట్రికల్ పోల్‌ప్రాజెక్టుకు బహుమతి లభించినట్టు చెప్పారు. మెమొంటో, నగదు బహుమతులను కమిషన్ స్కూల్ ఆఫ్ ఎడ్యుకేషన్ సురేష్‌కుమార్, ఏపీఎస్‌సీఆర్‌టీ డైరెక్టర్ ప్రతాప్‌రెడ్డి అందజేశారన్నారు. ప్రాజెక్టు గైడ్ టీచర్ సీహెచ్.బాలకృష్ణకు కూడా మెమొంటో అందజేసినట్టు తెలిపారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖాధికారి సలీం బాషా ఆయా విద్యార్థులను అభినందించారు. ఉపాధ్యాయులు నాయుడు, అనీల్ గణపతిరావు, చిరంజీవి, రామకృష్ణ, రవికుమార్, చక్రధర్ తదితరులు పాల్గొన్నారు.

చెడు వ్యసనాలకు బానిస కావొద్దు

ఏఎస్పీ ధీరజ్


మాట్లాడుతున్న ఏఎస్పీ ధీరజ్, పోలీస్ సిబ్బంది

సాక్షి, పాడేరు: చెడు వ్యసనాలకు బానిసలై బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని ఏఎస్పీ ధీరజ్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. స్థానిక లోచలిపుట్టు గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలను శుక్రవారం ఆయన సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నత చదువులతోనే బంగారు భవిష్యత్తుకు నాంది అన్నారు. తల్లిదండ్రులకు భరోసా కల్పించేలా ముందుకు సాగాలని ఆయన సూచించారు.

అదృశ్యమైన విద్యార్థినులు క్షేమం

తల్లిదండ్రులకు అప్పగించిన పోలీసులు

చింతపల్లి రూరల్: స్థానిక గిరిజన సంక్షేమ శాఖ బాలికల ఆశ్రమ పాఠశాల నుంచి యాజమాన్యానికి సమాచారం ఇవ్వకుండా ఆదివారం వెళ్లిపోయిన ముగ్గురు విద్యార్థినులు క్షేమంగా ఉన్నారని సీఐ రమేష్ తెలిపారు. వారిని శుక్రవారం తల్లిదండ్రులకు స్థానిక పోలీసు స్టేషన్‌లో అప్పగించారు. విద్యార్థినుల అదృశ్యంపై పాఠశాల హెచ్ఎం కొండలరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఆయన వివరించారు. పాఠశాలలో చదువుతున్న పాంగి గాయత్రి (ఆరో తరగతి), గెమ్మిల నీరజ (ఆరో తరగతి), పాంగి గీత(ఐదవ తరగతి) తల్లిదండ్రుల మీద బెంగతో ఆదివారం హాస్టల్ నుంచి బయటకు వెళ్లిపోయారన్నారు. స్థానిక హనుమాన్ జంక్షన్‌లో తిరుగుతున్న విద్యార్థినులను వారి అమ్మమ్మ గుర్తించిందన్నారు. వెంటనే వారిని తమ ఇంటికి తీసుకువెళ్లి సోమవారం పాఠశాలకు పంపించిందని సీఐ తెలిపారు. అయినప్పటికి వారు పాఠశాలకు రాకుండా పరిసర ప్రాంతాల్లో తిరుగుతున్నారన్నారు. వీరిని చూసిన కుటుంబ సభ్యులు కాంతమ్మ కందులగాదిలో తన నివాసానికి తీసుకువెళ్లిందన్నారు. ఈ మేరకు సమాచారం తెలుసుకున్న తమ సిబ్బంది అక్కడికి వెళ్లి విద్యార్థినులను తల్లిదండ్రులకు అప్పగించారన్నారు. ఎస్ఐ అరుణ్‌కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం అందించాలి


నెబులైజర్ అందజేస్తున్న ఐటీడీఏ పీవో అభిషేక్

పాడేరు రూరల్ : అమెరికన్ ఇండియా ఫాండేషన్ మాన్సీ కార్యక్రమం ద్వారా సరఫరా చేసిన నెబ్యులైజర్లను ఐటీడీఏ పీవో వి.అభిషేక్ శుక్రవారం హుకుంపేట మండలానికి చెందిన 15 మందికి నెబ్యులైజర్లను అందజేశారు. నెబ్యులైజర్ల సహాయంతో చిన్నారులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని ఐటీడీఏ పీవో అభిషేక్ సూచించారు. ఐటీడీఏ ఏపీవో వి.ఎస్.ప్రభాకర్‌రావు, డీఆర్వో అంబేద్కర్, ఎస్‌డీసీ శర్మ, డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్‌బాషా, అమెరికన్ ఇండియా ఫాండేషన్ స్టేట్ ప్రోగ్రాం మేనేజర్ శ్రీకృష్ణ పాల్గొన్నారు.

ట్రైనీ ఐఏఎస్‌లు గుర్తించిన సమస్యలు పరిష్కరిస్తాం


ట్రైనీ ఐఏఎస్‌లతో ఐటీడీఏ పీవో అభిషేక్

ఐటీడీఏ పీవో అభిషేక్

సాక్షి, పాడేరు : పాడేరు ఐటీడీఏ పరిధిలోని పలు గ్రామాల్లో సందర్శించిన ట్రైనీ ఐఏఎస్‌లు గుర్తించిన సమస్యలను పరిష్కరిస్తానని ఐటీడీఏ పీవో వి.అభిషేక్ స్పష్టం చేశారు. వారం రోజుల పాటు ఏజెన్సీలో పర్యటించిన ట్రైనీ ఐఏఎస్‌ల బృందంతో శుక్రవారం ఐటీడీఏ కార్యాలయంలో ప్రాజెక్టు అధికారి వి.అభిషేక్ ముచ్చటించారు. జీకే వీధి మండలం దుప్పిలవాడ, చింతపల్లి మండలం తాజంగి తదితర ప్రాంతాల్లో వారు పర్యటించి, గుర్తించిన సమస్యల నివేదికను పీవో పరిశీలించారు. ఏజెన్సీలో సికిల్‌సెల్ ఎనీమియాతో బాధపడుతున్న వారికి ప్రభుత్వం నెలకు రూ.10వేల పింఛన్ అందజేస్తుందన్నారు. పలువురు శిక్షణ ఐఏఎస్‌లు మాట్లాడుతూ ఏజెన్సీలో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకం బాగుందన్నారు. తాజంగి పర్యాటక ప్రాంతం అద్భుతంగా ఉందని కితాబిచ్చారు. పర్యాటక ప్రాంతాల్లో ప్లాస్టిక్ నిషేధం అమలుపై విస్తృతంగా ప్రచారం చేస్తే మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉందన్నారు. అనంతరం ట్రైనీ ఐఏఎస్‌ల బృందం పాడేరులో నిర్మిస్తున్న మెడికల్ కళాశాలను పరిశీలించారు. పద్మాపురం గార్డెన్, గిరి గ్రామదర్శినిని సందర్శించారు. పలువురు ట్రైనీ ఐఏఎస్‌లు, ఐటీడీఏ ఏపీవో వెంకటేశ్వరరావు, పరిపాలనాధికారి హేమలత, వెలుగు ఏపీడీ మురళి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే అభివృద్ధి


వెలమలకోట-పోక్సుపేట రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు

- ఎమ్మెల్యే ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు
- రోడ్డు నిర్మాణాలకు శంకుస్థాపన

రంపచోడవరం: వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత నియోజకవర్గంలో తరువాత అనేక అభివృద్ధి పనులు చేపట్టినట్టు ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంత ఉదయభాస్కర్ పేర్కొన్నారు. మండలంలో శుక్రవారం పలు రోడ్డు నిర్మాణాలకు వారు శంకుస్థాపన చేశారు. ముందుగా రూ.60 లక్షలతో నిర్మించనున్న ధరమడుగుల దిబ్బలవీధి బ్రిడ్జి పనులకు శంకుస్థాపన చేశారు.అనంతరం వెలమలకోట నుంచి ఊట్ల గ్రామానికి రూ. 4 కోట్ల వ్యయంతో చేపట్టనున్న బీటీరోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనేక గ్రామాల గిరిజనులకు ఎంతో ఉపయోగమైన ఊట్ల రోడ్డు అధ్వానంగా మారినా గతంలో ఎవరు పట్టించుకోలేదన్నారు. గిరిజనులకు మెరుగైన రవాణా వ్యవస్థను ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. గ్రామాల మధ్య రహదారుల అనుసంధానం చేస్తున్నట్లు తెలిపారు. టిబూరుగుబంద- బి.వెలమలకోట, ధరమడుగుల -చిన్నబీరంపల్లి, దబ్బవలస- వెట్టిచెలకల, పీరుకొండ-తిరగటిరొళ్ల రోడ్లకు వారు శంకుస్థాపన చేశారు.ఈ కార్యక్రమంలో ఎంపీపీ బందం శ్రీదేవి, జెడ్పీటీసీ పండా వెంకలక్ష్మి, వైస్ఎంపీపీ కొమ్మిశెట్టి బాలకృష్ణ, పండా కుమారి,ఎంపీటీసీలు, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.